వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 040
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జనవరి 20, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## నూటెంకిని పరామర్శించిన కేశవమూర్తి



తీవ్ర అనారోగ్యంతో హనుమకొండలోని ఏకశిలా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ నూటెంకి ప్రభాకర్ ను మంగళవారం వరంగల్ వాయిస్ ఈవెనింగ్ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, జర్నలిస్ట్ ఉస్నగిరి శ్రీకాంత్ పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.2,500 ఆర్థిక సాయాన్ని ప్రభాకర్ భార్యకు కేశవమూర్తి అందజేశారు.
–వరంగల్ వాయిస్, హనుమకొండ



# బలవంతం వద్దు

వివరాలు 2లో..

## వాహనదారులకు ఊరట

- రోడ్డుపైనే పెండింగ్ చాలన్ల వసూళ్లకు బ్రేక్
- వాహనం కీ లాక్కోవడం, బండి సీజ్ చేయడం కుదరదు
- చట్టపరంగానే బకాయిలు వసూలు చేయాలి
- చలాన్ల విషయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు



పెండింగ్ చలాన్ల బలవంతపు వసూళ్లపై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చలాన్లు కట్టాలంటూ రోడ్డుపైనే వాహనాన్ని నిలిపివేయడం, బైక్ కీస్ లాక్కోవడం, సీజ్ చేయడం ఇక కుదరదంటూ పేర్కొంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే వసూలు చేయాలని, చెల్లించకపోతే నోటీసులు ఇవ్వాలని వ్యాఖ్యానించింది. గత కొంత కాలంగా ట్రాఫిక్ పోలీసులు చలాన్ల పేరుతో వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రహదారులపై వాహనాలను తనిఖీ చేసే సమయంలో పెండింగ్ చలాన్లు ఉన్నాయంటూ వాహనదారులను బలవంతం పెట్టవద్దని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. పోలీసుల విధులు కేవలం నిబంధనలను పర్యవేక్షించడమేనని, చలాన్ల వసూలు కోసం వాహనదారులను వేధించడం చట్టవిరుద్ధమని పేర్కొంది. దీంతో పెండింగ్ చలాన్ల వసూలు విషయంలో గత కొంత కాలంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేయడం, వాహనదారులను ఇబ్బందులను గురిచేయడం నుంచి ఊరట లభించింది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



## గట్టమ్మ సేవలో ‘కడియం’ కుటుంబం

### మొక్కులు చెల్లించుకున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

ములుగు జిల్లా కేంద్రం సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గట్టమ్మ తల్లిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ ఈవో, అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేయగా, ఆలయ అధికారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల రాకతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది.
– వరంగల్ వాయిస్, ములుగు



8లో..

## మీ నిర్లక్ష్యం కుటుంబానికి శాపం కావొద్దు

☐ సెంట్రల్ జోన్ డీసీపీ కవిత



## కొండా యువసేన క్యాలెండర్ ఆవిష్కరణ

కొండా యువసేన అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన కొండా యువసేన నూతన సంవత్సర క్యాలెండర్–2026 ను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కొండా యువసేన కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. – వరంగల్ వాయిస్, కాశీబుగ్గ

# బలవంతం వద్దు

- వాహనదారులకు ఊరట
- రోడ్డుపైనే పెండింగ్ చలాన్ల వసూళ్లకు బ్రేక్
- వాహనం కీ లాక్కోవడం, బండి సీజ్ చేయడం కుదరదు
- చట్టపరంగానే బకాయిలు వసూలు చేయాలి
- చలాన్ల విషయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ట్రాఫిక్ పోలీసుల బలవంతపు వసూళ్లకు బ్రేక్ పడింది. ఇకపై రోడ్డుపైనే వాహనం నిలిపివేసి పెండింగ్ చలాన్లు కట్టాలంటూ ఇబ్బందులకు గురిచేయడం కుదరదంటూ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రోడ్డుపైనే వాహనాన్ని నిలిపివేయడం, పోలీస్ స్టేషన్ తరలించడం, బైక్ కీస్ లాక్కోవడం, సీజ్ చేయడం ఇక కుదరదంటూ పేర్కొంది. గత కొంత కాలంగా ట్రాఫిక్ పోలీసులు చలాన్ల పేరుతో వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

### వాహనదారులకు ఊరట..

హైకోర్టు ఉత్తర్వులతో వాహనదారులకు ఊరట లభించింది. ఏదైనా కారణంతో వాహనాన్ని ఆపినప్పుడు వాహనదారుడే స్వచ్ఛందంగా తన పెండింగ్ చలాన్లను క్లియర్ చేసేందుకు ముందుకు వస్తేనే పోలీసులు ఆ డబ్బులు వసూలు చేయవచ్చని న్యాయస్థానం సూచించింది. ఒకవేళ వాహనదారులు ఆ సమయంలో చెల్లించడానికి ఇష్టపడకపోతే వారిని నిర్బంధించే అధికారం పోలీసులకు లేదని స్పష్టం చేసింది. పెండింగ్ చలాన్లను వసూలు చేయడానికి ఒక పద్ధతి ఉంటుందని పేర్కొంది. నిబంధనల ప్రకారం కోర్టు నోటీసులు పంపాలని హైకోర్టు ఆదేశించింది. పోలీసు యంత్రాంగం చట్టవిరుద్ధంగా రోడ్లపై నేరుగా నగదు వసూలు చేయడం సరికాదని అభిప్రాయపడింది. చట్టపరమైన ప్రక్రియ ద్వారానే పెండింగ్ బకాయిలను రాబట్టాలని సూచించింది.

### చట్టవిరుద్ధం..

పోలీసుల విధులు కేవలం నిబంధనలను పర్యవేక్షించడమేనని, చలాన్ల వసూలు కోసం వాహనదారులను వేధించడం చట్టవిరుద్ధమని హైకోర్టు పేర్కొంది. ట్రాఫిక్ పోలీసులు పెండింగ్ చలాన్ల వసూలుకు వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పోలీసులు వాహనాలను అడ్డగించడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ కోర్టు దృష్టి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబడుతూ కీలక ఆదేశాలు జారీ చేసింది.




## ప్రభుత్వ పాఠశాలల్లో.. మార్షల్ ఆర్ట్స్ తరగతులు

☐ టీపీసీసీ చేనేత విభాగం నేత చిప్ప వెంకన్న

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధిని సాధిస్తున్నాయనం టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకన్న అన్నారు. కొత్తవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిర్మాజిపేటలో మాస్టర్ రొడ్డబోయిన కోటేశ్వర్ ఆధ్వర్యంలో రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆత్మరక్షణ కార్యక్రమం 2025-26 లో భాగంగా 6 నుంచి 9వ తరగతి బాలికల కోసం తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం కుంగ్ ఫు (కరాటే) మార్షల్ శిక్షణా తరగతులను ప్రారంభించినట్లు చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. వరంగల్ జిల్లాలో 103 పాఠశాలల్లో మూడు నెలల కాల వ్యవధిలో కుంగ్ ఫూ మాస్టర్ లకు నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తూ బాలికలను సెల్ఫ్ డిఫెన్స్, ఆత్మరక్షణ కోసం తమను తాము ఏలా రక్షించుకోవాలో అన్న విషయాలను ఈ శిక్షణ ద్వారా నేర్పించడం జరుగుతుందన్నారు. బాలికలు పాఠ్యాంశాలతో పాటు సెల్ఫ్ డిఫెన్స్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుంగ్ ఫూ క్లాసులను సద్వినియోగం చేసుకొని తమను తాము రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను రూపొందించిందన్నారు. పోలీస్ విభాగంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేసి ఈవ్ టీజింగ్ లాంటి చర్యలను అరికడుతోందని వివరించారు. ఒక్క మిస్డ్ కాల్ తో మహిళలకు రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ పి.నాగమణి, పి.బుచ్చిరెడ్డి, భూపాల్ మాస్టర్ ఆర్.కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## యూత్ ఐడియాథాన్‌లో.. వరంగల్ డీపీఎస్ విద్యార్థుల ప్రతిభ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఐఐటీ ఢిల్లీలో థింక్ స్టార్టప్, సీబీఎస్ఈ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ప్రతిష్టాత్మక యూత్ ఐడియాథాన్ కార్యక్రమంలో పెండ్యాలలోని డీపీఎస్, వరంగల్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని పాఠశాల చైర్మన్ రవి కిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్, వరంగల్ విద్యార్థులు మేధా పెండ్యాల, జోయా తహ్మీనాలు పాల్గొన్నారు. అధ్యాపకుడు కాసిపేట మనోజ్ రాజ్ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో విద్యార్థులు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'ఫామ్ లింక్'అనే యాప్‌ను అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధస్సు ఆధారిత ఈ యాప్ ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం లభిస్తుందని, రైతులు నేరుగా మార్కెట్లతో అనుసంధానం కావడం, సరైన ధరలు పొందడం వంటి అంశాల్లో ఈయాప్ కీలక పాత్ర పోషిస్తుందని విద్యార్థులు వివరించారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. ఈ ఆలోచన దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, నిపుణుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగ అభివృద్ధికి వినియోగించే దిశగా ఈ ప్రాజెక్ట్ ఆదర్శంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వి.రవి కిరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ సమాజానికి ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

☐ జిల్లా కలెక్టర్ సత్య శారద




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో మత్తు పదార్థాలు, మారకద్రవ్యాలను సమర్థవంతంగా నిరోధించి యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై డీసీపీ అంకిత్ కుమార్ తో కలసి సంబంధిత శాఖల అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణపై ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలతో చెక్ పెట్టాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల సమీపంలోని కిరాణ షాపుల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రియిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అనుమానస్పద ప్రాంతాల్లో నిఘా పెట్టి తరచూ పెట్రోలింగ్ చేయాలని డీసీపీకి సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కాలేజీలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా విద్యార్థులను ఏర్పాటు చేసి వారిని తరచు కాలేజీ విద్యార్థుల ప్రవర్తన, నియమాల్ని పసిగడుతూ ఏదైనా అనుమానం వచ్చినట్లయితే గుర్తించి కౌన్సిలింగ్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ను ఆదేశించారు. జిల్లాలో మారు మూల ప్రాంతాల రైతులు వారు వేసే పంటలతో పాటు గంజాయిని పెంచకుండా ఏవైనా చర్యలు తీసుకునేందుకు తరచూ తనిఖీలు నిర్వహించి అనుమామస్పదమైన రైతులు ఉన్నట్లైతే కౌన్సిలింగ్ ఇప్పించాలని జిల్లా వ్యవసాయ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సుమ, ఉమారాణి, మామునూర్ ఏసీపీ వెంకటేష్, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, జిల్లా వైద్యశాఖ అధికారి సాంబశివరావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి..

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ అంకిత్ కుమార్ తో కలసి అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఖుష్ మహల్ వద్ద నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవం వేడుకల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డిఓలు సుమా, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి..

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణకు వివిధ కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీసీఓ రాంరెడ్డి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట అభివృద్ధికి రూ.15 కోట్లు

- కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన
- పనుల్లో నాణ్యత లోపిస్తే సహించను..
- ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మవద్దు
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్ది, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. మంగళవారం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవితో కలిసి ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. పట్టణంలోని దీర్ఘకాలిక సమస్యలైన డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణానికి ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత 30 ఏళ్లుగా వర్ధన్నపేట అభివృద్ధిలో వెనుకబడిందని, 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్నట్లున్న పరిస్థితిని మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతుంటే, ప్రతిపక్షాలు ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. తప్పుడు ఆరోపణలను ప్రజలు గమనించాలని, వాస్తవాలను గుర్తించి అభివృద్ధికి అండగా నిలవాలని కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి పట్టణ భవిష్యత్తుకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'డ్యూయల్ డెస్క్' బెంచీల వితరణ

### ఎన్ఆర్ఐ కృష్ణవేణి వర్మ ఉదారత



**వరంగల్ వాయిస్, వెంకటాపురం (ములుగు) :** విద్యార్థులు మెరుగైన వసతులతో విద్యనభ్యసించినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుందని, గ్రామీణ విద్యావ్యవస్థ బలోపేతానికి దాతలు ముందుకు రావాలని జర్మనీ నివాసి, ప్రవాస భారతీయురాలు పేరం కృష్ణవేణి వర్మ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మరికాలకొత్తూరు ప్రాథమిక పాఠశాలకు 'ప్రియ నేస్తం విద్యార్థులతో' ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన 10 డ్యూయల్ డెస్క్ బెంచీలను ఆమె మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో జీవీవీ సత్యనారాయణ, ట్రస్ట్ చైర్మన్ పింగిలి నాగరాజు బెంచీలను ప్రారంభించి మాట్లాడారు. జర్మనీలో ఉంటున్న కృష్ణవేణి వర్మ (పెద్దపల్లి జిల్లా మంథని వాస్తవ్యులు) తన స్వస్థలంపై మక్కువతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఈ సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి వర్మ పంపిన సందేశాన్ని నిర్వాహకులు చదివి వినిపించారు. "భారతదేశ భవిష్యత్తు గ్రామీణ విద్యావ్యవస్థపైనే ఆధారపడి ఉంది. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే విద్యార్థులకు మంచి వాతావరణం, వసతులు కల్పిస్తే వారు క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదుగుతారు" అని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్, లక్ష్మీనగరం కాంప్లెక్స్ హెచ్ఎం కె.రవీందర్, సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వితరణ చేసిన దాత కృష్ణవేణి వర్మకు, సహకరించిన ట్రస్ట్ సభ్యులకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## మందకృష్ణ మాదిగను కలిసిన రమేష్ కుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మహాజన సోషలిస్ట్ పార్టీ అధినేత మందకృష్ణ మాదిగను దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ పర్యటనలో భాగంగా నక్కలగుట్టలోని ఏపీసీపీ గెస్ట్ హౌస్‌లో విడిది చేసిన మందకృష్ణను కలిసి రమేష్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ భేటీ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో దళిత, గిరిజన వర్గాల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడాల్సిన అవసరం ఉందని రమేష్ కుమార్‌కు సూచించారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలవాలని ఆయన ఉద్బోధించారు. విద్యుత్ సంస్థలో హెల్పర్ స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు సుదీర్ఘ కాలం పాటు నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన రమేష్ కుమార్‌ను ఈ సందర్భంగా మందకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. వృత్తిరీత్యా బాధ్యతలు నిర్వహిస్తూనే సామాజిక స్పృహతో పనిచేయడం అభినందనీయమన్నారు. ఈ భేటీలో పలువురు దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే మామిండ్ల యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిండ్ల యశస్విని రెడ్డి పేర్కొన్నారు. తొర్రూరు పట్టణంలోని 10వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వివేకానంద కమ్యూనిటీ భవనాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వామి వివేకానందుని ఆశయాలకు అనుగుణంగా యువత అభివృద్ధి, సామాజిక సేవ, ఐక్యతను పెంపొందించే కార్యక్రమాలకు ఈ భవనం వేదికగా మారుతుందని ఆకాంక్షించారు. ఈ భవనం ద్వారా ఈ కింది ప్రయోజనాలు కలుగుతాయని ఆమె వివరించారు. స్థానిక ప్రజలు తమ ఇంటి వేడుకలు, సామాజిక సమావేశాలు నిర్వహించుకోవచ్చు. మహిళలు, యువతకు ఉపాధి శిక్షణలు, అవగాహన సదస్సులు నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. తొర్రూరు పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి ప్రజాప్రయోజన భవనాలను మరిన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడబోమని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, స్వామి వివేకానంద సేవా సంఘం ప్రతినిధులు, 10వ వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కూలీలందరూ ఉపాధి హామీ పథకాన్ని ఒక వరంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పని దినాలను ఉపయోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన సూచించారు. పనులు జరిగే ప్రాంతంలో కూలీలకు అవసరమైన కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నల్ల శంకర్, కారోబార్ కిన్నెర శ్రీనివాస్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని దమ్మన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. గ్రామ సర్పంచ్ దుబాసీ నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి మహిళకు అందాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ నవీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాండవుల భిక్షపతి, సీఏ యమున, దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ గొల్కొండ సుమలత, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అప్పయ్యపల్లి క్రికెట్ టోర్నీలో 'ఎల్లబోయిన బ్రదర్స్' క్లీన్ స్వీప్



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల పరిధిలోని అప్పయ్యపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎల్లబోయిన బ్రదర్స్ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చి విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో ఎల్లబోయిన బ్రదర్స్ జట్టుకు చెందిన ఎల్లబోయిన ఓంకార్ తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఫైనల్ మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించినందుకు గాను అతనికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. అంతేకాకుండా, టోర్నీ అంతటా నిలకడగా రాణించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' పురస్కారాన్ని కూడా ఓంకార్ దక్కించుకోవడం విశేషం. విజేతగా నిలిచిన ఎల్లబోయిన బ్రదర్స్ టీమ్ సభ్యులను, ప్రతిభ చాటిన ఓంకార్‌ను గ్రామస్తులు మరియు క్రీడా అభిమానులు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఒకే ఆసుపత్రికి రెండుసార్లు శంకుస్థాపన ఏంటి?

### బీజేపీ నేత కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వంద పడకల ఆసుపత్రి నిర్మాణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నాగరాజు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకే ఆసుపత్రికి రెండు చోట్ల శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం స్థానిక సంస్థల ఎన్నికల లబ్ధి కోసం కట్ర్యాల గ్రామ శివారులోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద శంకుస్థాపన చేశారని, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ వర్ధన్నపేట మండల కేంద్రంలో శంకుస్థాపన చేయడం ఏంటని ప్రశ్నించారు. "వంద పడకల ఆసుపత్రిని కట్ర్యాల, వర్ధన్నపేట.. ఇలా రెండు చోట్లా నిర్మించడం ఎలా సాధ్యం?" అని ఆయన నిలదీశారు. మూడు మండలాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద నిర్ణయించిన ఆసుపత్రిని, ఏ కారణంతో వర్ధన్నపేటకు తరలిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలను ఎమ్మెల్యే మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రి తరలిపోతుంటే కట్ర్యాల, కడారిగూడెం, ఉప్పరపల్లి, నల్లబెల్లి వంటి గ్రామాల కాంగ్రెస్ నాయకులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, శంకుస్థాపన చేసిన స్థలాలను మారుస్తూ కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలు గట్టి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గతంలో శంకుస్థాపన చేసిన ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్దే ఆసుపత్రిని నిర్మించకపోతే, మూడు మండలాల ప్రజలను ఏకం చేసి ధర్నాలు, బంద్‌లు నిర్వహిస్తామని మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** గ్రామంలో కష్టపడి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఓ ఆటో డ్రైవర్ అకాల మరణం ఆ కుటుంబంలో తీరని చీకట్లను నింపింది. ఖిలాషాపురం గ్రామానికి చెందిన శాగ నరేందర్ గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబానికి ఏకైక ఆధారమైన నరేందర్ మరణించడంతో ఆయన భార్య, ఇద్దరు చిన్న పిల్లలు తండ్రిని కోల్పోయి వీధిన పడ్డారు. కళ్లముందే తిరుగుతూ కుటుంబాన్ని సాకుతున్న వ్యక్తి ఇలా అర్ధాంతరంగా కన్నుమూయడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. నరేందర్ మరణవార్త విన్న వెంటనే గ్రామస్థులు, తోటి ఆటో కార్మికులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆటో డ్రైవర్ మృతితో ఆ కుటుంబం దిక్కులేనిదిగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యుత్ అధికారుల 'ప్రజాబాట'




**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని బూర్గుమళ్ళ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాబాట' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రజల వద్దకే వెళ్లి వారి విద్యుత్ సమస్యలను నేరుగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ఏడీఈ తిరుపతి నేతృత్వంలోని అధికారుల బృందం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించింది. అధికారులు స్వయంగా ఇంటింటికి తిరుగుతూ విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలు, లో–ఓల్టేజీ సమస్యలు, మీటర్ల పనితీరును పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్యలను, అధికారులు నేరుగా గ్రామానికి వచ్చి పరిష్కరించడంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాబాట వంటి కార్యక్రమాలు సామాన్యులకు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ తిరుపతితో పాటు ఏఎల్ఎం కిషన్, జేఎల్ఎం శ్రావణ్ కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# పరకాల మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరాలి

### ◆ ఎన్నికల ఇంచార్జి ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ వాయిస్, పరకాల :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పరకాల మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరడమే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి ఎర్రబెల్లి ప్రదీప్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం పరకాల నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ.. ప్రతి బూత్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని, వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా పార్టీ అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ప్రతి వార్డులో బలమైన కమిటీలను ఏర్పాటు చేసి యువత, మహిళలు మరియు లబ్ధిదారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని తెలిపారు. పోలింగ్ రోజున ఓటర్లను బూత్ వరకు తీసుకొచ్చే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని, క్రమశిక్షణతో పనిచేస్తే విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల అసెంబ్లీ కంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ కాళీ ప్రసాద్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు పడుతున్న శ్రమ వృథా పోదని, అందరం ఐక్యతతో పనిచేసి పరకాలలో బీజేపీ సత్తా చాటుదామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయచందర్ రెడ్డి, డాక్టర్ సంతోష్, పరకాల టౌన్ అధ్యక్షులు గాజుల నిరంజన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మేకల రాజవీరు, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు జయంత్ లాల్, మేఘనాథ్ దేవనూరి, జిల్లా నాయకులు సత్యనారాయణ, మహిళా నాయకురాలు వినిశెట్టి శారద, వేముల సుధారాణి, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సమస్యలు పరిష్కరించాలి

### ఏఐకేఎఫ్ నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రైతులకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న పంట నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించాలని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ఏఐకేఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంసారెడ్డి మాట్లాడుతూ.. యాసంగి సాగులో ఉన్న రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. పండించిన పంటకు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.500 బోనస్ నిధులను జాప్యం చేయకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం వెంటనే అందించాలని ఆయన కోరారు. విత్తన వ్యాపారులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసేలా ఉన్న నూతన విత్తన చట్టాన్ని తక్షణమే సవరించాలని, రైతులకు హాని కలిగించే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు తగిన సూచనలు ఇవ్వడంలో అధికారులు చొరవ చూపాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవసరమైన యూరియా అందించడంలో విఫలమయ్యాయని, రైతుల పక్షాన ఏఐకేఎఫ్ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కిషన్, జిల్లా కమిటీ సభ్యులు దామరకొండ రమేష్, వెంకటేశ్వర్లు, చీపురు ఓదయ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# మంచి జీవనశైలితోనే క్యాన్సర్‌కు చెక్

### ప్రతిమ ఆసుపత్రి డాక్టర్ సుమిత్ర



**వరంగల్ వాయిస్, దామెర :** క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, సరైన ఆహార అలవాట్లు పాటించడం ద్వారా క్యాన్సర్ వంటి మహమ్మారి వ్యాధులను దూరం చేసుకోవచ్చని ప్రతిమ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ టి.సుమిత్ర తెలిపారు. మండలంలోని ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కౌమార దశ, మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ సుమిత్ర మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, సాధ్యమైనంత వరకు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. క్యాన్సర్ వ్యాధులన్నీ ప్రమాదకరమైనవి కావని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స సులువవుతుందని స్పష్టం చేశారు. 9 నుంచి 14 ఏళ్ల బాలికలు ముందస్తు జాగ్రత్తగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని సూచించారు. ఆగస్టు 15 వరకు దామెర క్రాస్ రోడ్డులోని ప్రతిమ ఆసుపత్రిలో మహిళల కోసం ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుమిత్ర వెల్లడించారు. డిజిటల్ మెమోగ్రఫీ, బ్రెస్ట్ స్కాన్, సీరం క్రియాటిన్, పాప్ స్మియర్, సిబిపి, ఆర్‌బిఎస్ వంటి పరీక్షలను ఉచితంగా అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, ఉపాధ్యాయులు డాక్టర్ గణపతి, రాజేంద్రప్రసాద్, విజయ ప్రభ, అనిత కుమారి, డాక్టర్ వి.జగన్, వసుంధర దేవి, స్వరూప రాణి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, జయ, సమత, సురేందర్, ఆసుపత్రి వైద్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఉడత ఊపులకు హరీష్ రావు భయపడరు

### • మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రతీకార చర్యలకు పాల్పడుతోందని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై ఆయన ఘాటుగా స్పందించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "మీ ఉడత ఊపులు, తాటాకు చప్పుళ్లకు హరీష్ రావు భయపడతారని అనుకుంటే అది మీ అజ్ఞానం మాత్రమే" అని విమర్శించారు. అక్రమ కేసులు, నిర్బంధాలతో బీఆర్ఎస్ పార్టీని బలహీనపరచలేరని, అబద్ధాల మీద కట్టిన కాంగ్రెస్ రాజకీయ కోటను రాబోయే ఎన్నికల్లో ప్రజలే నేలమట్టం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. హరీష్ రావు చట్టాన్ని గౌరవించే నాయకుడని, ఎన్నిసార్లు విచారణకు పిలిచినా హాజరవుతారని చల్లా స్పష్టం చేశారు. కానీ, కేసుల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. పాలన అంటే కక్ష రాజకీయాలు కాదని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉండాలని హితవు పలికారు. ఎన్నికల ముందు ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ముందుగా ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. గొప్పగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇప్పటికైనా అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. హరీష్ రావు వెనుక తెలంగాణ రాష్ట్ర ప్రజల కోట్లాది గొంతుకలు ఉన్నాయని, నాయకత్వాన్ని భయపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. "ప్రజా తీర్పే మీ రాజకీయాలకు అసలు రిమాండ్" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.

# అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను సమాంతరంగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో నూతనంగా చేపట్టనున్న పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా నగరంలోని కాలనీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామని ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో వరంగల్ నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు. తమ కాలనీలో ఎప్పటి నుంచో ఉన్న సమస్యను గుర్తించి పనులు ప్రారంభించినందుకు కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** సమాజం కోసం సుదీర్ఘకాలం సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో 'పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అసోసియేషన్ రూపొందించిన నూతన పాకెట్ డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు ఒకచోట చేరి తమ యోగక్షేమాలను పంచుకోవడానికి ప్రత్యేకంగా ఒక భవనం అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, త్వరలోనే స్థల కేటాయింపు చేయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. పెన్షనర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పెన్షనర్‌కు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ఆరోగ్య కార్డుల వంటి ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. తమ జీవిత కాలమంతా విధుల్లో శ్రమించిన పెన్షనర్ల అనుభవం సమాజానికి ఎంతో అవసరమని ఆయన కొనియాడారు. పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, రిటైర్డ్ రైల్వే, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జీడబ్ల్యూఎంసీ 40వ డివిజన్ పరిధిలోని పాత కాలం నాటి కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో నూతన కల్వర్టుల ఏర్పాటుకు కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. మంగళవారం ఉర్సు దర్గా ప్రాంతంలోని చౌక్ మహిళా వద్ద డ్రైనేజీ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదు మేరకు ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానికులతో కలిసి సమస్యను పరిశీలించిన కార్పొరేటర్, పాత కాలంలో నిర్మించిన రాతి కనీలు (Stone slabs) బరువు ఒత్తిడి వల్ల కృంగిపోయాయని గుర్తించారు. దీనివల్ల మురుగునీరు ప్రవహించకుండా అడ్డుపడి రోడ్లపైకి వస్తోందని గ్రహించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా త్వరలోనే ఇక్కడ నూతన కల్వర్టుల నిర్మాణం చేపడతామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యం, సౌకర్యం దృష్ట్యా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని ఆయన స్పష్టం చేశారు. కల్వర్టుల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బి.పాషా, అస్మా, ఎండీ మాశుక్, బిలాల్ తదితరులు పాల్గొన్నారు. తమ విన్నపానికి తక్షణమే స్పందించి పరిశీలనకు వచ్చిన కార్పొరేటర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# డోర్నకల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బలోపేతం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డోర్నకల్ పట్టణంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. మంగళవారం పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కత్తెరసాల విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలువురు ముఖ్య నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మున్సిపాలిటీలోని 6వ వార్డు నుండి భాసిపంగ్ గోపి, 14వ వార్డు నుంచి డీసీఎం శ్రీనులకు విద్యాసాగర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సూచనలు, మార్గదర్శకత్వంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వార్డు సభ్యులుగా పోటీ చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన తాము నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వార్డు ప్రజల మద్దతు తమకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని వారు విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఆదరించి తమను భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండేటి హేమచంద్రశేఖర్, కొత్త వీరన్న, గౌస్, శరత్, యశోదర్, జైన్, వెంకటమ్మ, రామ్ భద్రం, మియా మల్లేశం, శీను, రాము, చంటి, రహీం తదితరులు పాల్గొన్నారు.

# వనదేవతల సేవలో దాస్యం వినయ్ భాస్కర్

## మేడారం అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు



**వరంగల్ వాయిస్, మేడారం :** హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. తన సతీమణితో కలిసి అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వినయ్ భాస్కర్ దంపతులకు మేడారం పూజారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు సమ్మక్క-సారలమ్మ గద్దెలపై నిలువెత్తు బంగారాన్ని సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, కండువాతో ఘనంగా సత్కరించారు. దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడారం వనదేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు, అనుచరులు పాల్గొన్నారు.



# టీపీయూఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

## అధ్యక్షుడిగా బిట్ల వెంకటేశ్వర్లు





**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆదేశానుసారం, వరంగల్ జిల్లా పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి కొండబత్తుల రాజమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బిట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గుండు కామేశ్వర్ రావు ఎన్నికయ్యారు. ఎన్నికైన ఇతర సభ్యుల వివరాలను ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా గుర్రపు సుధాకర్ రావు, మంత్రి సతీష్, కోశాధికారిగా పడాల సోమయ్య, ఉపాధ్యక్షులుగా గజెల్లి రవీందర్, మార్త రమేష్ బాబు, పాసికంటి చంద్రశేఖర్, చిమ్మని రాజన్ బాబు, మైన వాణిశ్రీ, జాయింట్ సెక్రటరీలుగా కొండబత్తుల రాజేందర్, వడ్నాల నగేష్, గజ్వేల్లి కోటేశ్వర్ రావు, వంగరి కోటేశ్వర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు యెలుగం నరసయ్య, దేవులపల్లి సదానందం, గుండ నరసింహమూర్తి, రామా రవీందర్, పబ్లిసిటీ సెక్రటరీగా బత్తుల సత్యం, కార్యాలయ కార్యదర్శిగా అముదాల భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా స్వర్గం చంద్రశేఖర్, ధర్మపురి రాజగోవింద్, అల్లి సాంబయ్య, రామ నరేందర్, గుల్లపల్లి విద్యాసాగర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మార్కండేయ స్వామి ఆశీస్సులతో పద్మశాలీల అభ్యున్నతికి, సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గతంలో నిర్వహించిన విధంగానే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని, వివిధ శాఖల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పద్మశాలీలు అందరూ సంఘం బలోపేతానికి చేయూతనివ్వాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, సాయిరాజ్, కోడం రవి ప్రకాష్, గుర్రపు రాజమౌళి, బుర్ర తిరుపతయ్య, కోడూరి రమేష్, గుండు రవీందర్, కుడికాల సత్యనారాయణ, వన్నాల వెంకటస్వామి, మార్గం కుమార్ స్వామి తదితరులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, జనవరి 20, 2026

## రాజమౌళి చిత్రపటానికి నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపల్ పరిధిలోని 20వ వార్డుకు చెందిన కనుకుంట్ల రాజమౌళి దశదిన కర్మ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాజమౌళి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజమౌళి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నివాళులర్పించిన వారిలో టీపీసీసీ (TPCC) ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ మడికొండ శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొచ్చు జెమిని, ఎడ్ల ప్రసాద్ మరియు ఇతర ముఖ్య నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దాపూర్ సర్పంచ్ ఎన్నికపై కోర్టు నోటీసులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల ఫలితం ఇప్పుడు న్యాయస్థానం మెట్లు ఎక్కింది. ఎన్నికల అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారి తన గెలుపును అపహాస్యం చేశారని బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి వేల్పుల సురేష్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో జరిగిన అవకతవకలను వివరించారు. సురేష్ కథనం ప్రకారం.. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత తాను మూడు ఓట్ల మెజారిటీతో గెలిచినట్లు అధికారులు తొలుత ప్రకటించారు. అయితే, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు మాట మార్చారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఎలుకటి రవికి సంబంధించిన చెల్లని ఓట్లను తిరిగి లెక్కలోకి తీసుకొని, ఆయన గెలిచినట్లు ఏకపక్షంగా ప్రకటించారని సురేష్ ధ్వజమెత్తారు. అధికారులు చేసిన ఈ అన్యాయంపై తాను కోర్టును ఆశ్రయించినట్లు సురేష్ వెల్లడించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. కాంగ్రెస్ అభ్యర్థి ఎలుకటి రవి, ఆత్మకూరు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల అధికారి దేవేందర్ రెడ్డిలకు నోటీసులు జారీ చేసిందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా తనకు రావాల్సిన విజయాన్ని వెనక్కి తీసుకునే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.

## చెట్టును ఢీకొట్టిన బైక్..

### ఇద్దరి యువకుల మృతి



**వరంగల్ వాయిస్, మల్హార్ :** మండలంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ అదుపుతప్పి వేప చెట్టును బలంగా ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో యువకుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ విషాద సంఘటన రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని చిగురుపల్లి వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎడ్లపల్లి నుండి రుద్రారం మీదుగా బస్వాపూర్ వెళ్తున్న బైక్, చిగురుపల్లి వద్దకు రాగానే అకస్మాత్తుగా అదుపుతప్పి మార్గమధ్యలో ఉన్న వేప చెట్టును వేగంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి బైక్ నుజ్జునుజ్జవగా, ఇద్దరు యువకులు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మరణించారు. మృతుల్లో ఒకరు కిషన్ రావు పల్లె గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించగా, మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో గారేపల్లికి చెందిన మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సంఘటనా స్థలానికి చేరుకున్న కొయ్యూరు పోలీసులు మృతదేహాలను పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

## పీడీఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయండి



◆ వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని పీడీఎస్ యూ వరంగల్–హనుమకొండ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని అశోక సెంటర్‌లో ఈ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 23, 24, 25 తేదీలలో ఈ మహాసభలు జరగనున్నాయని వారు వెల్లడించారు. జనవరి 23న భారీ విద్యార్థి ర్యాలీ, బహిరంగ సభ, జనవరి 24న ప్రతినిధుల సభ, జనవరి 25న విద్యా గోష్టి కార్యక్రమం, ఉంటుందని తెలిపారు. బహిరంగ సభలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ప్రజా కవి జయరాజు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, గోకినేపల్లి వెంకటేశ్వర్లు ప్రసంగిస్తారు. ప్రతినిధుల సభలో ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఐ.వి.రమణారావు, వి.మనోహర్ రాజులు పాల్గొంటారు. జనవరి 25న నిర్వహించే విద్యా గోష్టిలో ఫాసిజం ప్రతిఘటన – విద్యార్థుల కర్తవ్యం అంశంపై రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, విద్యారంగం సంక్షోభం అంశంపై ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, శాస్త్రీయ దృక్పథం – విద్యార్థుల కర్తవ్యం అంశంపై ఎస్.ఎల్. పద్మ ప్రసంగిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై ఈ మహాసభల్లో కులంకషంగా చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని నాయకులు స్పష్టం చేశారు. విద్యార్థి లోకం పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సభలను దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కార్తీక్, అరుణ్, దీక్షిత్, అర్చన, శ్యామ్, బబ్లు, శ్వేత పాల్గొన్నారు.

## వనదేవతల చెంత కడియం కుటుంబం

- మేడారం అభివృద్ధి అద్భుతం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, మేడారం/తాడ్వాయి:** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) మొక్కుగా చెల్లించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. మేడారం గద్దెల ప్రాంగణాన్ని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వెయ్యి ఏళ్ల పాటు నిలిచిపోయేలా పునర్నిర్మించడం మహా అద్భుతంగా ఉందన్నారు. రూ.250 కోట్లతో విస్తృత ఏర్పాట్లు చేపట్టి, కోయ సంస్కృతిని చాటిచెప్పేలా శిల్పాలను రూపుదిద్దిన ముఖ్యమంత్రి





రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆదివాసీల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జాతర సమయంలోనే భక్తులు వచ్చేవారని, ఇప్పుడు ఏడాది పొడవునా వస్తున్నందున శాశ్వత వసతులు కల్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు. తాను ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు ఆరు సార్లు జాతర ఏర్పాట్లు పర్యవేక్షించానని, అయితే ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి వాటన్నింటికన్నా మిన్నగా ఉందని కొనియాడారు. మేడారం జాతర పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరకు జాతీయ పండుగ హోదా ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాది ఆలయాలకు వేల కోట్లు ఖర్చు చేస్తున్న కేంద్రం, దక్షిణాది కుంభమేళాగా పిలిచే మేడారానికి నామమాత్రపు నిధులు కూడా ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఇది గిరిజన సంస్కృతిని అవమానించడమేనని, ఇప్పటికైనా వివక్ష వీడి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సీఎం కప్ క్రీడలను జయప్రదం చేయండి

• పర్వతగిరి ఎంపీఓ శేషు, ఎంఈఓ భిక్షపతి

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సీఎం కప్' క్రీడలను విజయవంతం చేయాలని పర్వతగిరి మండల ఎంపీఓ శేషు, ఎంఈఓ భిక్షపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడల నిర్వహణకు సంబంధించిన తేదీలను వెల్లడించారు. జనవరి 17 నుంచి 22 వరకు నిర్వహించబడతాయి. గ్రామ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి జనవరి 28 నుండి 31 వరకు మండల స్థాయిలో పోటీలు ఉంటాయి. గ్రామ, మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో అదనంగా చెస్ (దదూరం), కరాటే పోటీలు కూడా ఉంటాయని తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనాలనుకునే అభ్యర్థులు (15-36 ఏళ్ల లోపు వారు) తమ ఫోటో, ఆధార్ కార్డ్‌తో http://satg.telangana.gov.in/cmcup వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని



సూచించారు. పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించవచ్చు. పంచాయతీ కార్యదర్శులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి ఈ క్రీడా సంబరాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో జడ్పీహెచ్ఎస్ పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నవీన్ కుమార్, పీడీలు అనిల్, పాషా, అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆలోచింప చేసే అద్భుత సినిమా..

## సినిమాను చూసి మెచ్చుకున్న ఎన్టీఆర్




తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకోచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్`2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.

# మారుతి తదుపరి ప్రాజెక్ట్‌పై ఊహాగానాలు

టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మారుతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు, ప్రభాస్‌తో చేసిన ప్రతిష్టాత్మక చిత్రం 'రాజా సాబ' అనంతరం ఆయన తదుపరి ప్రాజెక్టుల గురించి సోషల్ వి□డియాలో రకరకాల ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై తాజాగా ఒక స్పష్టత వచ్చింది, నిజానికి గత కొన్ని రోజులుగా మారుతి ఒక మెగా హీరోతో సినిమా చేయబోతున్నారని, స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయ్యాయని కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ వి□డియా హ్యాండిల్స్‌లో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. దీనికి తోడు కొన్ని నిర్మాణ సంస్థల పేర్లు, నిర్మాతల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి, ఈ ప్రచారం కాస్తా వైరల్ కావడంతో అభిమానుల్లో అయోమయం నెలకొంది.

తాజా సమాచారం ప్రకారం, మారుతి తదుపరి సినిమా గురించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలన్నీ కేవలం పుకార్లు మాత్రమే, అవి పూర్తిగా నిరాధారమైనవని, అందులో ఎటువంటి వాస్తవం లేదని ఆయన పీఆర్ టీమ్ ప్రకటించింది, కేవలం క్లిక్ బైట్స్ కోసం లేదా అంచనాల కోసం సృష్టించిన వార్తలుగా వీటిని పరిగణించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. మారుతి తన ప్రతి ప్రాజెక్టును చాలా ప్లాన్డ్‌గా అనౌన్స్ చేస్తుంటారు, ఒకవేళ తన తదుపరి సినిమా ఖరారైతే, ఆ వివరాలను ఆయన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా, సంబంధిత నిర్మాణ సంస్థల అధికారిక ప్రకటనల ద్వారా వెల్లడిస్తారు అని పేర్కొన్నారు. అనధికారిక మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని షేర్ చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని మారుతి సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.




# శర్వానంద్‌కు కలిసి వచ్చిన బాలయ్య సెంటిమెంట్

HAASHTAG MEDIA VAMSI-SHEKAR VISWA CM
RAMABRAHMAM SUNKARA



టాలీవుడ్‌లో కొన్ని చిత్రాలకు సంబంధించిన విశేషాలు భలే ఆసక్తికరంగా మారుతుంటాయి. అలాంటి సంఘటన ఒకటి హీరో శర్వానంద్ నటించిన నారి నారి నడుమ మురారి సినిమాకు జరిగింది. శర్వా హీరోగా రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో అనిల్ సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి సూపర్ హిట్ గా నిలిచింది. ఫెస్టివల్ సీజన్‌లో వచ్చిన చిత్రాల్లో చిన్న సినిమాగా వచ్చి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్బ్లాక్‌బస్టర్‌గా మారింది. ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 36 ఏళ్ల క్రితం నందమూరి బాలకృష్ణ హీరోగా, ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో 'నారి నారి నడుమ మురారి' అనే సినిమా విడుదలై అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. అందుకే అదే టైటిల్‌ను శర్వానంద్ సినిమా కోసం ఫిక్స్ చేయగానే, అది బాలకృష్ణసినిమా టైటిల్ కదా అని ఆయన అనుమతి తీసుకోవాలని శర్వానంద్ స్వయంగా బాలక□ష్ణకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఈ విషయం నాకెందుకు చెప్తున్నావు, నిరభ్యంతరంగా టైటిల్ పెట్టుకో అంటూ బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు, టైటిల్ పెట్టుకోమని చెప్పడమే కాకుండా సినిమా షూటింగ్‌కు, టైటిల్ రివీల్ కు ముహూర్తం కూడా బాలకృష్ణఫిక్స్ చేశారట. ఇక భారీ సినిమాల మధ్య పోటీగా రిలీజ్ అయినా నారి నారి నడుమ మురారి శర్వా కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచి ఇటు నిర్మాతలకు అటు డిస్ట్రిబ్యూ□టర్స్ కు భారీ లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ విషయాన్నీ బాలయ్యకు చెప్పేందుకు శర్వానంద్ మరోసారి కాల్ చేయగా 'నా పేరు కాపాడావు? సినిమా సూపర్ హిట్ అయిందని తెలిసింది. ఇలానే రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు చేయాలి' అంటూ శర్వానంద్‌ను దీవించారట బాలయ్య. ఆ సంతోషాన్ని తన ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటూ ఇక నుంచి నా సినిమాలన్నింటికీ బాలయ్యతోనే ముహూర్తం పెట్టించుకుంటాను అని అన్నారట. మొత్తానికి, బాలయ్య టైటిల్ తో ఆయన పెట్టిన ముహూర్తంతో శర్వానంద్‌కు భారీ హిట్ అందుకున్నాడు.

# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా





## హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు

తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్ట్స్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ□`లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మీ నిర్లక్ష్యం కుటుంబానికి శాపం కావొద్దు

□ సెంట్రల్ జోన్ డీసీపీ కవిత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ వాయిస్, వరంగల్ : మీ నిర్లక్ష్యం మీ కుటుంబానికి శాపం కావొద్దని సెంట్రల్ జోన్ డీసీపీ కవిత హితవు పలికారు. మీకు ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులు రొడ్డున పడుతారన్న విషయం మరువరాదన్నారు. ఆరైవ్, ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనీఖీల్లో పట్టుబడిన వాహనదారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, ఆటో డ్రైవర్లకు మంగళవారం ములుగురొడ్డులోని వెంకటేశ్వర గార్డెన్స్ లో కౌన్సిలింగ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జీవితం చాలా విలువైనదని, మద్యం సేవించి వాహనాలు నడపటం ద్వారా జరిగే రోడ్డు ప్రమాదాల సంఖ్య ఘణనీయంగా పెరగడంతో పాటు మరణాల సంఖ్య కూడ పెరగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనాలను నడపటం ఇందుకు ప్రధాన కారణంగా మారుతోందన్నారు. మీతో పాటు పాదచారులు, ఇతర వాహనదారులు మ□త్యువాత పడుతున్నారని, మీపై అధారపడిన మీ కుటుంబ సభ్యుల క్షేమం కోరి మద్యం సేవించి వాహనం నడపోద్దన్నారు. అలాగే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ మీ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని డీసీపీ పిలుపునిచ్చారు. అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు జరిమానాలు విధించి వారిని ఇబ్బందులకు గురిచేయడం మా లక్ష్యం కాదని, ప్రతి వాహనదారుడు క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేరుకోవడమే వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనం నడపటం కారణంగా మీతో పాటు మీ పక్కవారు సైతం ప్రమాదాల భారిన పడతారని, ప్రతి వాహనదారుడు క్రమ శిక్షణతో వాహనాలు నడపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సుజాత, సీతా రెడ్డి, వెంకన్న, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు, ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గోన్నారు.



# ఇంటర్ విద్యార్థులకు ఉపశమనం


**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఇంటర్ వార్షిక పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. తొమ్మిది లక్షలకు పైగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 23న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 24న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగబోతున్నాయి. ఇవి ముగిసిన తర్వాత ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి.

# సమన్వయంతో సేవలందించాలి

- నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు
- అగ్రం పహాడ్ జాతర పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** సమ్మక్క జన్మస్థానం చిన్న మేడారంగా పేరుగాంచిన అగ్రం పహాడ్ సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం ఆత్మకూరు మండలం అగ్రం పహాడ్ సమ్మక్క సారలమ్మ జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనులను రేవూరి ప్రకాష్ రెడ్డి, స్నేహ శబరిష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. గత జాతరలకంటే ఎక్కువ సంఖ్యలో మరుగుదొడ్లు, స్థానాల ఘట్టాలు, మంచినీటి సౌకర్యాలు, భక్తులు విడిది చేసేందుకు కావలసిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పనులు చేయడం పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఎండోమెంట్ ఈవో నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రివ్యూ మీటింగ్ లో అన్ని శాఖల అధికారుల నుండి చేసిన అభివృద్ధి పనుల వివరాలను తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 24 గంటలు అన్ని శాఖల అధికారులు జాతర పూర్తయ్య వరకు ఇక్కడే ఉండి జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్షలాదిమంది వచ్చే భక్తులకు అడుగడుగున సకల సౌకర్యాలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. వరంగల్ నుండి జాతర వరకు మహిళలకు ఫ్రీ బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించాలని ఎమ్మెల్యే పోలీసులకు సూచించారు. గత జాతరలో పోలీసుల నిర్లక్ష్యం వల్లనే గొడవలు జరిగాయని ఈసారి నిర్లక్ష్యం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని ఎమ్మెల్యే అని అన్నారు. ఏసీపీ సతీష్ బాబుకు జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గట్టి బంధవస్తు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈనెల 25న మళ్లీ నేను వస్తా జాతర మూడు రోజులు ఇక్కడే ఉండి భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తానని ఎమ్మెల్యే అన్నారు.నేను వచ్చే లోపు అన్ని పనులు పూర్తి కావాలని ఎవరు నిర్లక్ష్యం చేసిన సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు 24 గంటలు భక్తులకు అందుబాటులో ఉండి వారికి కావలసిన సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలిగితే అధికారులదే బాధ్యత వహించాలని కలెక్టర్ హెచ్చరించారు. ఎండోమెంట్ అధికారులు అప్రమత్తంగా ఉండి భక్తులకు సంతోషంగా దర్శనం చేసుకునే విధంగా చూడాలన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కావలసిన ఏర్పాటు చేయవలసిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, ఏసిపి సతీష్ బాబు,మార్కెట్ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు,మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రేవూరి జైపాల్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, సర్పంచులు ముద్దం సాంబయ్య, గంగుల మహేందర్, వివిధ శాఖల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పార్కులు పరిశుభ్రంగా ఉండాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- వరంగల్ పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని పార్కులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హార్టికల్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ పార్క్, టెలికాం పార్క్, క్రిస్టియన్ కాలనీ పార్క్, టీ ఆర్ టీ పార్క్ లను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్కులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ములుగు రోడ్డు నుంచి ఎంజీఎం, ఎం జీఎం నుంచి పోచమ్మ మైదాన్, వెంకట్రామ జంక్షన్ వరకు మీడియన్ లను పరిశీలించి గ్యాప్ లలో మొక్కలను నాటాలన్నారు. అందులో ఉన్న కలుపు మొక్కలను (వీడ్) తొలగించాలని, ఏపుగా పెరిగిన మొక్కలను కత్తిరించి సుందరంగా రూపొందించాలని సూచించారు. టెలికాం పార్క్ సమీపంలో గృహనిర్మాణ వ్యర్థాలు (సీఎన్ డీ) రోడ్డుపై వేయడాన్ని గమనించిన కమిషనర్ సదరు యజమానికి పెనాల్టీ వేయాలని ఆదేశించిన నేపథ్యంలో రూ.1,500 జరిమాన విధించినట్లు శానిటేషన్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వస్కుల బాబు, హెచ్‌ఓ లక్ష్మారెడ్డి, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, సానిటరీ ఇన్ స్పెక్టర్ భీమయ్య, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అనూహ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com